సెల్‌ఫోన్లను బాధితులకు అందజేత

సెల్‌ఫోన్లు రికవరీ చేసి అందజేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం, మే 27 : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించబడిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఇబ్రహీంపట్నం పోలీసులు సోమవారం ఏసీపీ కేవీపీ రాజు ఆధ్వర్యంలో బాధితులకు అప్పగించారు. వివిధ రకాలుగా 18 ఫోన్లు ఐఎంఈఐ, సీఈఐఆర్ అప్లికేషన్‌లలో ఎంట్రీ చేసి దర్యాప్తు చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. ఇట్టి సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉండవచ్చునని తెలిపారు. ఈ మేరకు క్రైమ్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ బాబురావు, శ్రీలత, రిసెప్షనిస్టు నవనీతలతో పాటు పలువురు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు మారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు భారీగా విరాళాలు

విరాళం అందజేస్తున్న పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కొత్తూరు, మే 27: గ్రామ దేవతల ఆలయాలకు సోమవారం భారీగా విరాళాలను అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రూ.51 వేలు, కాంగ్రెస్ యువ నాయకుడు రామకృష్ణ రూ. 31 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దేవేందర్‌యాదవ్, నర్సింహా గౌడ్, బ్యాగరి యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్, బండి కృష్ణ, రాఘవేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లోయపల్లి గౌడ్ సంఘం కమిటీ ఎన్నిక

పూజలో పాల్గొన్న నూతనంగా ఎన్నికైన సభ్యులు, గ్రామ పెద్దలు

మంచాల, మే 27 : మంచాల మండలం లోయపల్లి గౌడ సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడిగా, కంఠమహేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా కారింగు సదానందంగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నర్సింగ్ ఓంకార్ గౌడ్‌తో పాటు 25మందితో సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్షణతో స్వయం ఉపాధి

శిక్షణ పొందినవారితో సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, మే 27: శిక్షణ సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి పొందాలని పసుమాముల మాజీ సర్పంచ్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. త్రిశూల్ రూరల్ ఎడ్యుకేషనల్ ఎకనామిక్ సొసైటీ (ట్రీస్) ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని కళానగర్‌లో మహిళలకు మూడు నెలలపాటు టైలరింగ్ శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా వారికి సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రీస్ చైర్మన్ రేవల్ల మదన్, కౌన్సిలర్ మోతె మణెమ్మ, కోఆప్షన్ సభ్యుడు చర్లపల్లి శంకరయ్యగౌడ్, ప్రజాప్రతినిధులు రాములింగం, శేఖర్, అప్పన్న, కుమార్, నిఖిల్‌కుమార్, వెంకటేశ్, శ్రీను పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

యాచారం, మే 27 : మండలంలోని గున్‌గల్ గ్రామానికి చెందిన ముత్యాల రాజేశ్ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పేదరికంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. 1998-99 సంవత్సరంలో రాజేశ్‌తో పాటు పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.80 వేల నగదును సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన మిత్రులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రమాబాయి అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్లటౌన్, మే 27 : రమాబాయి అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్ స్వామి తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, హక్కుల కోసం తమ కుటుంబాన్ని త్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మహేశ్, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, ఆలిండియా చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లెపల్లి శ్రీనివాస్, సీపీఐ నాయకులు సుధాకర్, సభ్యులు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే కొనాలి

- మండల వ్యవసాయాధికారులు
- ఆయా గ్రామాల రైతులకు అవగాహన సదస్సులు

షాబాద్ మండలం నాగరగూడలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి వెంకటేశం

షాబాద్ మండలం బోడంపహాడ్‌లో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

షాబాద్, మే 27: రైతులు నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశం అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతారం, బోడంపహాడ్, మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ, తాళ్లపల్లి గ్రామాల్లో విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నాగరగూడ, షాబాద్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు కావాల్సిన పత్తి, వరి తదితర పంటల విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి కొరత రాకుండా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని తెలిపారు. విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించవద్దని చెప్పారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజేశ్వరి, లిఖిత, సోనిశ్రీ, గీత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల రూరల్ : మార్కెట్‌లో నకిలీ విత్తనాల అమ్మకం, విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని మండల వ్యవసాయ అధికారి తులసి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామరగిద్ద, చన్‌వెల్లి గ్రామాల్లో నకిలీ విత్తనాలు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి తులసి మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో మార్కెట్లలో నకిలీ విత్తనాల అమ్మకం జోరుగా సాగుతుందని, రైతులు ఇది గమనించి నాణ్యమైన విత్తనాలు విక్రయించేలా వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బాలకృష్ణ, రెండు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : రైతులు ప్రధానంగా లూజు సంచులల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ రైతులకు సచిం చారు. మండలంలోని కందివనం, ఎలికట్ట, బూర్గుల, పీర్లగూడెం, వెలజర్ల, దేవునిబండా తండాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సులను నిర్వహించారు. నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు వివిధ గ్రామాల్లో ఈ అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

షాద్‌నగర్‌రూరల్: విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ఇబ్రహీంపట్నంరూరల్ : వర్షాకాలం పంటల సాగుకోసం విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయ విస్తరణాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వ్యవసాయాధికారుల సూచనల మేరకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్ : నాగన్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి శ్రవణ్‌కుమార్

కడ్తాల్ : కాల పరిమితి ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత అన్నారు. మండల పరిధిలోని మక్తమాదారం, నాగిరెడ్డిగూడ, పెద్దవేములోని తండా, ముద్విన్ గ్రామాల్లో విత్తన కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఏవో మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే దుకాణాల నుంచి రసీదులు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: కోనాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి

అవగాహన సదస్సులు

ఆమనగల్లు : మండల పరిధిలోని కోనాపూర్, సీతారంనగర్‌తండా, చంద్రాయన్‌పల్లి తండా, మూర్తుజపల్లి గ్రామాలల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో, ఏఈవోలు విత్తనాల ఎంపిక, పంట మార్పిడి పద్ధతిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి ఆకుతోటపల్లిలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువులు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమాల్లో విస్తరణ అధికారులు రాణి, సాయిరాం, శివతేజ, మీనాక్షి , రైతులు పాల్గొన్నారు.

చేవెళ్లరూరల్ : దామరగిద్ద గ్రామంలో బ్యానర్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో తులసి

మూడు ఇండ్లలో చోరీలు

ఆమనగల్లు, మే 27 : ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్రంగుట్ట కాలనీలో ఆదివారం రాత్రి మూడు ఇండ్లలో దొంగలు బంగారు అభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంగుట్ట కాలనీకి చెందిన వరికుప్పల బాలకిష్టయ్య అతని మామ వర్ధంతి కారణంగా ఆదివారం పోలేపల్లిలోని తాళ్లకుంటకు వెళ్లాడు, మరుసటి రోజు సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికే ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న కమ్మలు , 15 తులాల వెండి, కాళ్ల పట్టీలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అదే విధంగా అదే కాలనీలో ఉన్న పస్పులేటి వెంకటేశ్, రాజేంద్ర ప్రసాద్ ఇండ్లలో కొంత నగదును దోచుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్, మే 27 : మండలంలోని పేద ప్రజలకు అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటానని జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వాసుదేవ్‌పూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పాత్లావత్ గోజీ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ట్రస్టు తరపున రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చీరాంనాయక్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, సులోచన, నాయకులు సాయిలు, రమణ, రామకృష్ణ, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, మే 27 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘం రైతు కుటుంబాలకు అండగా ఉంటుందని చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌యాదవ్ అన్నారు. సంఘంలో సభ్యుడైన తారామతిపేటకు చెందిన రైతు మహ్మద్ రహీముద్దీన్ ఏప్రిల్ 28న మృతి చెందాడు. ఆయన కుమారుడు మహ్మద్ నహీంకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో సోమవారం చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మేకల రాములు, కందాడి మహిపాల్ రెడ్డి, తారామతిపేట మాజీ సర్పంచ్ వడ్డేపల్లి పాపయ్యగౌడ్, మాజీ వైస్‌చైర్మన్ వడ్డేపల్లి సతీశ్‌గౌడ్, నాయకులు జెనిగల ఎర్రయ్యాదవ్, అచ్చని రాము, మేనేజర్ జక్కుల ఐలేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రారంభించాలి

- ఎంపీపీ కొప్ప సుకన్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొప్ప సుకన్య

యాచారం, మే27: అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, నిధులు మంజూరైన ప్రతి పాఠశాలలో వెంటనే అభివృద్ధి పనులను ప్రారంభించాలని ఎంపీపీ కొప్ప సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఎంపిక, నిధుల మంజూరు, ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆదర్శ పాఠశాలల కమిటీ ఎన్నికపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆమె సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం, అవకతవకలు చోటు చేసుకుంటే సహించేదిలేదన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంను సకాలంలో అందించేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు

బోడకొండ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలశంకర్

మంచాల, మే 27 : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. మండలంలోని 13 పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం ఒక్కో పాఠశాలకు లక్ష రూపాయలు మంజూరయ్యాయి. ఈ పనులను సోమవారం మంచాల ఎంపీడీవో బాలశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు మంజూరైన నిధులతో రంగులు వేయడం, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయడం, బాలికల మూత్రశాలల మరమ్మతులు, తరగతి గదులకు తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయడం వంటి వాటికి నిధులు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. 13 పాఠశాలలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అఖిలారెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో అక్బర్

చేవెళ్ల రూరల్, మే 27 : మండల పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన వాటిలో మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలని ఎంఈవో అక్బర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేవరంపల్లి, రేఘడిగణాపూర్, ఆలూర్, ఎన్కేపల్లి, రామన్నగూడ, న్యాలట, బస్తేపూర్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంఈవో సందర్శించి ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలో మొదటి విడుతలో 20 అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికయ్యాయని తెలిపారు. బడులు పునర్ ప్రారంభమయ్యేలోపు మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ తదితర వాటిని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

యాచారం, మే27: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి తప్పనిసరిగా పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య అన్నారు. మండలంలోని తాటిపర్తిలో సోమవారం ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు జరిగి ఐదు నెలలు గడిచినా ప్రభుత్వం కొత్త పనులు మంజూరు చేయకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. మండలంలో 12వేల మంది కూలీలకు జాబ్‌కార్డులుండగా 3800మంది మాత్రమే పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నంరూరల్, మే 27 : వారం తా పూర్వ విద్యార్థులు. 12 ఏండ్ల క్రితం పదో తరగతి పూర్తి కాగానే ఉన్నత చదువుల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. ఆ తర్వాత ఉద్యోగాలు, ఉపాధి చేసుకుంటూ జీవిస్తున్నా రు. మరోసారి కలువాలనే తపనతో వారం తా ఒక చోటకు చేరారు. మండల పరిధిలోని పోల్కంపల్లిలో ఉన్నత పాఠశాలలో 2010-11 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఇబ్రహీంపట్నంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

వైకుంఠ రథం వితరణ



గ్రామ పంచాయతీకి వైకుంఠ రథాన్ని అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ నర్సింహ

కడ్తాల్, మే 27 : తలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి సోమవారం మాజీ జడ్పీటీసీ నర్సింహ తన తండ్రి వెంకటయ్య జ్ఞాపకార్థం రూ.6 లక్షల విలువ గల వైకుంఠ రథాన్ని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పుట్టిన ఊరు అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేశ్, ఎంపీటీసీ హేమరాజు, మాజీ సర్పంచ్ లలిత, మాజీ ఉప సర్పంచ్ పద్మ అనిల్, నాయకులు యాదయ్య, మల్లేశ్, శేఖర్, మోహన్‌రెడ్డి, ఈశ్వర్, విఠల్, జంగయ్య, పాండు, వెంకటాచారి, కుమార్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పోతుగల్‌లో జీవాలకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, మే 27: జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్, గొల్లూరుగూడ గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు చిటుక వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీవాల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు పోషించుకుని జీవనం సాగించే రైతులకు మంచి ఆదాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీను, బలరా, సాగర్, రైతులు తదితరులున్నారు.